# అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం

లెనిన్

*1910లో డెన్మార్క్ రాజధాని కోపెన్‌హెగెన్‌లో క్లారాజట్కిన్ నాయకత్వాన వివిధ దేశాలకు చెందిన మహిళల సమావేశంలో 'మార్చి 8'ని అంతర్జాతీయ శ్రామిక మహిళల పోరాట దీక్షాదినంగా జరపమని పిలుపునిచ్చారు. 1920, 21లలో కామ్రేడ్ లెనిన్ మార్చి 8 సందర్భముగా ఇచ్చిన సందేశాలలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన సోషలిస్టు విప్లవ విజయం ద్వారా మాత్రమే స్త్రీలు ఎదుర్కొంటున్న పీడన, అసమానతల సంపూర్ణ పరిష్కారముంటుందని చెప్తూ ప్రజాస్వామ్యాన్ని గురించి పెద్దయెత్తున ప్రవచించే బూర్జువా సమాజాలు ఈ దిశగా తమ 'పవిత్రఆస్తి' పట్ల వినమ్రభావం కారణంగా ఒక్కడుగు కూడా వేయలేవని స్పష్టంచేశారు. సామ్రాజ్యవాద శృంఖలాల నుండి శ్రామిక స్త్రీ పురుషుల విముక్తి వెల్లువను ఏ శక్తీ ఆపజాలదనే చారిత్రక సత్యాన్ని ఆయన నొక్కి చెప్పారు.*

– సంపాదకుడు

**బోల్షెవిజం,** రష్యన్ అక్టోబర్ విప్లవ సారాంశం ఏమిటంటే పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎవరైతే అందరికంటే ఎక్కువగా పీడితులైనారో సరిగ్గా వాళ్ళనే రాజకీయాలలోకి ఆకర్షించడం. రాజరికంలోనూ, బూర్జువా ప్రజాతంత్ర రిపబ్లిక్‌లలోనూ పెట్టుబడిదారులు వాళ్ళను అణగ దొక్కారు. మోసగించారు. దోపిడీ చేశారు. భూమీ ఫాక్టరీలు సొంత ఆస్తిగా వున్నంతకాలం, పెట్టుబడిదార్లచేత ప్రజలశ్రమకు జరిగే ఈ పీడనా, మోసమూ, దోపిడీ అనివార్యం.

బోల్షెవిజం సోవియట్ అధికార సారం ఏమిటంటే, బూర్జువా ప్రజాస్వామ్య బూటకాన్నీ, నటననూ గుట్టు కడగడమూ, భూమి మీదా, ఫాక్టరీల మీదా సొంత స్వామ్యాన్ని రద్దు చేయడమూ, దోపిడీకి గురయ్యే శ్రామిక జనాల చేతుల్లో రాజ్యాధికారమంతటినీ కేంద్రీకరించడమూ, వీళ్ళు, ఈ జనాలు, రాజకీయాలను అనగా నూతన సమాజాన్ని నిర్మించే వ్యవహారాన్ని, తమ చేతుల్లోకి తీసుకుంటారు. ఇది సులభమైన కర్తవ్యం కాదు: జనాలు పెట్టుబడిదారీ వ్యవస్థ అణచివేతకు, పీడనకు గురైనారు. కానీ వేతన బానిసత్వం నుండీ, పెట్టుబడిదారీ వ్యవస్థ దాస్యం నుండీ బయటపడే మార్గం మరొకటిలేదు – వుండజాలదు.

కానీ, రాజకీయాలలోకి స్త్రీలను కూడా ఆకర్షించకుండా జనాలను ఆకర్షించలేము. ఎందుకంటే, పెట్టుబడిదారీ వ్యవస్థలో మానవ జాతిలోని 'ఆడ' అర్ధం రెండు విధాల పీడనకు గురవుతున్నది. శ్రామిక మహిళ, రైతు మహిళ పెట్టుబడి పీడనకు గురవుతున్నారు. కానీ అది కాక, బూర్జువా రిపబ్లిక్‌లలో కెల్ల ప్రజా స్వామికమైన దానిలో కూడా వాళ్ళు, ప్రప్రథమంగా కొన్ని హక్కులు లేకుండా వున్నారు. ఎందుకంటే వాళ్ళు "గృహ దాస్యం"లో నిలిచి వున్నారు, "గృహ బానిసలు"గా కొనసాగుతున్నారు. ఎందుకంటే వాళ్ళు వంటగదిలోనూ, కుటుంబ గృహ వ్యవస్థలోనూ మహా మురికిదీ, ఎముకలు విరిచేదీ, మూర్ఖతా పాదకమూ అయిన చాకిరీ క్రింద క్రుంగిపోతున్నారు.

సోవియట్, బోల్షెవిక్ విప్లవం చేస్తున్నట్లు ప్రపంచంలో ఏ పార్టీ గానీ, యే విప్లవంగానీ స్త్రీలెదుర్కొంటున్న పీడన, అసమానతల కూకటి వేళ్ళను ఇంత సమూలంగా పెకిలించివేయాలని కలలో కూడా ఎప్పుడూ అనుకోలేదు. ఇక్కడ, సోవియట్ రష్యాలో, శాసనరీత్యా స్త్రీ, పురుషుల మధ్య యే అసమానత్వపు జాడ మిగలలేదు. వివాహానికీ, కుటుంబానికీ సంబంధించిన శాసనాలలోని మరీ అసహ్యమైన, నీచమైన, కాపట్యపూరితమైన అసమానతనూ, పిల్లల విషయంలోని అసమానతనూ సోవియట్ అధికారం నిశ్శేషంగా తొలగించింది.

స్త్రీ విమోచనంలో ఇది మొదటి అడుగు మాత్రమే. కానీ బూర్జువా రిపబ్లిక్కులలో అత్యంత ప్రజాస్వామికమైనది కూడా, ఈ మొదటి అడుగైనా వేయడానికి సాహసించలేదు. కారణం ఏమిటంటే, "పవిత్ర సొంత ఆస్తి" పట్ల వినమ్ర భక్తి భావం.

రెండవదీ, అత్యంత ముఖ్యమైనదీ అయిన అడుగు ఏమిటంటే, భూమిమీదా, ఫ్యాక్టరీల మీదా సొంత స్వామ్యాన్ని రద్దు చేయడం. ఇది, ఇది మాత్రమే స్త్రీ సంపూర్ణ, యధార్ధ విమోచనకూ, అల్పిష్ఠి గృహ నిర్వహణ నుండి భారీ స్థాయి సామాజికీకృత గృహ సేవలకు జరిగే పరివర్తన ద్వారా "గృహ బానిసత్వం" నుండి స్త్రీ విముక్తికి దారి ఏర్పరుస్తుంది,

ఈ పరివర్తన కష్టమైనది; ఎందుకంటే, మహా లోతుగా పాతుకుపోయినదీ, దీర్ఘకాలంగా స్థిరపడినదీ, కరడుగట్టినదీ, మొండిదీ అయిన "వ్యవస్థ"కు (సత్యానికి మరింత దగ్గరగా వుండా లంటే, వెకిలితనమూ, కిరాతకత్వమూ అయినట్టి దానికి) కొత్త రూపు ఇవ్వడం దీనిలో ఇమిడివుంది. కానీ, పరివర్తన ప్రారంభమైంది. రథం కదిలింది, మనం దారి పట్టాము.

కనుక, సాటిలేనిదీ, నమ్మశక్యం కానంత కష్టమైనదీ, కానీ మహత్తరమైనదీ అయిన ఈ కర్తవ్యాన్ని, సార్వత్రికంగా మహత్తరమైనదీ, నిజంగా విముక్తి దాయకమైనదీ అయిన కర్తవ్యాన్ని నిర్వహించడంలో మొదటిదైన సోవియట్ రష్యాకు ఈ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినంనాడు ప్రపంచంలోని సకల దేశాలలోనూ జరిగే శ్రామిక మహిళల అసంఖ్యాక సభలు శుభాకాంక్షలు పంపుతాయి.

భీషణమైన, తరచుగా కిరాతకమైన బూర్జువా ప్రతిస్పందన ఎదుట ధైర్యం కోల్పోవద్దని ప్రోత్సాహ వాక్యాలు వస్తాయి. ఒక బూర్జువా దేశం ఎంత "స్వేచ్ఛాయుతంగా", ఎంత "ప్రజాస్వామికంగా" వుంటే, కార్మిక విప్లవానికి వ్యతిరేకంగా ఆ దేశపు పెట్టుబడిదార్ల ముఠా చేసే విలయతాండవం అంత విశృంఖలంగా వుంటుంది. దీనికొక ఉదాహరణ ఉత్తర అమెరికా సంయుక్త రాష్ట్రాల డెమోక్రటిక్ రిపబ్లిక్. కానీ కార్మిక జన బాహుళ్యం ఇప్పటికే మేల్కొన్నది. అమెరికా, యూరప్‌లలోని, వెనుకబడిన ఆసియాలోని నిశ్చేతన, నిద్రాళు జడ జనాలు కూడా సామ్రాజ్యవాద యుద్ధం కారణంగా అంతిమంగా మేల్కొన్నారు.

ప్రపంచపు ప్రతి మూల నాందీ వాచకం జరిగింది.

సామ్రాజ్యవాద శృంఖలాల నుండి ప్రజల విముక్తి, పెట్టుబడి శృంఖలాల నుండి శ్రామిక స్త్రీ పురుషుల విముక్తి వెల్లువను ఏదీ ఆపజాలదు. పట్టణాలలోని, గ్రామాలలోని కోటానుకోట్ల శ్రామిక స్త్రీ పురుషులు ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతున్నారు. అందుకనే, పెట్టుబడి శృంఖలాలనుండి శ్రమ విముక్తి కొరకు జరిగే ఈ ఉద్యమం ప్రపంచమంతటా జయిస్తుంది.

**మార్చి 4, 1921**

**అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం సందర్భంగా**

పెట్టుబడిదారీ వ్యవస్థలో లాంఛనగత సమానత్వంతో ఆర్థిక అసమానత్వమూ, తత్పర్య వసానంగా సామాజిక అసమానత్వమూ కలిసి వుంటాయి. అది పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క ప్రధాన లక్షణాలలో ఒకటి. బూర్జువావర్గపు మద్దతుదారులైన ఉదారవాదులు ఉద్దేశ పూర్వకంగా మరుగుపరచేదీ, పెటీబూర్జువా ప్రజాతంత్రవాదులకు అర్థంకానిదీ అయిన లక్షణం. అన్నట్లు, ఆర్థిక సమానత్వం కొరకు మనం చేసే కృతనిశ్చయమైన పోరాటంలో పెట్టుబడిదారీ అసమానత్వాన్ని బహిరంగంగా ఒప్పుకోవడమూ, కొన్ని పరిస్థితులలో అసమాన త్వానికి సంబంధించిన యీ బహిరంగ ఒప్పు దలను కార్మికవర్గ రాజ్య వ్యవస్థకు (సోవియట్ రాజ్యాంగానికి) ప్రాతిపదికగా చేయడమూ కూడా మనకు అవసరమయ్యేటట్లు చేస్తుంది పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క యీ లక్షణం.

కానీ లాంఛనగత సమానత్వం (చట్టం యెదుట సమానత్వం, కడుపు నిండిన వాని, ఆకలిగొన్నవాని; ఆస్తి లేని వాని, ఆస్తిగలవాని "సమానత్వం") విషయంలో కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ స్థిరంగా వుండజాలదు. ఈ అస్థిరత్వం యొక్క అత్యంత మిరుమిట్లు గొలిపే వ్యక్తీకరణలో ఒకటి స్త్రీ పురుషుల అసమానత్వం. అత్యంత ప్రగతిశీల రిపబ్లికన్, ప్రజాతంత్ర బూర్జువా రాజ్యాలు కూడా సంపూర్ణ సమానత్వం యివ్వలేదు.

రష్యా సోవియట్ రిపబ్లిక్ మినహాయింపు లేకుండా స్త్రీల అసమానతకు సంబంధించిన శాసనాల జాడలన్నింటినీ ఒక దెబ్బతో వూడ్చి పారవేసి, చట్టం యెదుట స్త్రీల సంపూర్ణ సమానత్వం కట్టుదిట్టం చేసింది.

సాంస్కృతిక స్థాయికి అత్యుత్తమమైన గీటురాయి స్త్రీల శాసనగత ప్రతిపత్తి అని అంటారు. ఈ సూక్తిలో ప్రగాఢమైన సత్యపు బీజం వుంది. ఈ దృష్టితో చూస్తే, కార్మికవర్గ నియంతృత్వం మాత్రమే, సోషలిస్టు రాజ్యం మాత్రమే అత్యున్నత సాంస్కృతిక స్థాయిని సాధించగలదు, సాధించింది.

శ్రామిక మహిళల ఉద్యమానికి లభించిన కొత్త, శక్తివంతమైన, సాటిలేని ఊపు మొదటి సోవియట్ రిపబ్లిక్ స్థాపనతో (దృఢీకరణతోనూ) – దీనికి తోడుగా, దీనికి సంబంధించి, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌తోనూ – అనివార్యంగా ముడిపడివుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ చేత ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగాగానీ, సంపూర్ణంగాగానీ, పాక్షికంగా గానీ పీడనకు గురైనవాళ్ళ ప్రస్తావన వచ్చింది గనుక, సోవియట్ వ్యవస్థ, సోవియట్ వ్యవస్థ మాత్రమే, ప్రజాస్వామ్యాన్ని హామీ చేస్తుందని చెప్పాలి. కార్మికవర్గం యొక్క, బీదరైతుల యొక్కా ప్రతిపత్తి దీనిని స్పష్టంగా తెలియజేసింది. స్త్రీల ప్రతిపత్తి దీనిని స్పష్టంగా తెలియజేసింది.

కానీ, సోవియట్ వ్యవస్థ వర్గాలరద్దు కొరకూ, ఆర్థిక, సామాజిక సమానత్వం కొరకూ జరిగే చివరి నిర్ణయాత్మక పోరాటం. ప్రజాస్వామ్యం, పీడిత లింగంతో సహా పెట్టుబడిదారీ వ్యవస్థచేత పీడితులైనవాళ్ళకున్న ప్రజాస్వామ్యం కూడా, **మనకు చాలదు.**

**లాంఛనగత సమానత్వం కొరకు మాత్రమే కాక స్త్రీలకు ఆర్థిక, సామాజిక సమానత్వం కొరకు పోరాడడం శ్రామిక మహిళా ఉద్యమం యొక్క ప్రధాన కర్తవ్యం.** ప్రధాన విషయం యేమిటంటే, స్త్రీలను సామాజికంగా ఉత్పాదకమైన శ్రమలో పాల్గొనేటట్లు చేయడం "గృహ బానిసత్వం" నుండి వాళ్ళను విముక్తి చేయడం, వంటగది లోనూ, పిల్లల గదిలోనూ, మూర్ఖతాపాదకమైన, అవమానకరమైన నిత్య చాకిరీ నుండి వాళ్ళను విముక్తి చేయడం.

ఈ పోరాటం దీర్ఘమైనదిగా వుంటుంది; సామాజిక సంవిధానాన్ని, నీతులనూ మౌలికంగా పునర్నిర్మించడం దీనికి అవసరం. కానీ, కమ్యూనిజం యొక్క సంపూర్ణ విజయంతో యీ పోరాటం ముగుస్తుంది.

**మార్చి 4, 1920**

౦౦౦౦